క్లుప్తంగా

తుల్జా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న తుల్జా భవానీ అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అష్టోత్తర శత కలశ స్థాపనం, పంచామృతాభిషేకం, చండీ హోమం, విశేష కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. భగవాన్ శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బాణావత్ కుబియా నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు రూ.50వేల విలువ చేసే పల్లకీని ఆలయ పాలకవర్గానికి అందజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గిరిజనులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నృత్యం, యోగాలో శిక్షణ

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థులకు డ్యాన్స్‌మాస్టర్ నవీన్‌నాని డ్యాన్స్‌లతో పాటు యోగా నేర్పించారు.నిర్వహించారు. తొలుత ప్రతిజ్ఞ గేయ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి వేడుకలు జరిపారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్, భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, నీలం సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ గురించి విద్యార్థులకు అవగాహన



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. అనుభవజ్ఞులైన పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ముందుగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం శ్రేయస్సు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లెప్రసీ వ్యాధి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రేయస్సు సంస్థ ప్రతినిధి సీహెచ్‌వీ కోటేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది రమేష్, బీడీసీ మల్లిక పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

పెనుగంచిప్రోలు: రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని విజయవాడ కమిషనరేట్ డీసీపీ అజిత వేజెండ్ల అన్నారు. ఆమె శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచటంతో పాటు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులకు అండగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ జనార్ధన్‌నాయుడు, జగ్గయ్యపేట సీఐ జానకీరామ్, ఎస్ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో బంగారు ఆభరణాల చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురం రావిచెట్టు సెంటర్‌కు చెందిన వరద లక్ష్మి కుటుంబ పనుల మీద ఇంటికి తాళం వేసి గత ఏప్రిల్‌లో విజయనగరం వెళ్లారు. భర్త అనారోగ్యం కారణంగా అక్కడే ఉన్నారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో విజయనగరం నుంచి తిరిగి విజయవాడలోని ఇంటికి వచ్చారు. ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలోని చెవి కమ్మలు, ఒక జత మాటీలు, మొత్తం ఎనిమిది గ్రాములు బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితురాలు లక్ష్మి భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

13 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రామరాజ్యనగర్ కబేళా సెంటర్‌కు చెందిన ముక్కు పద్మావతి వేసవి సెలవుల్లో మార్కాపురంలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. శనివారం మార్కాపురం నుంచి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులోని బంగారు ఉంగరాలు రెండు, చెవి బుట్టలు ఒక జత కనిపించలేదు. దీనిపై పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మొత్తం 13 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొంది.

సేవాలయాలుగా సచివాలయాలు

- వలంటీర్ వ్యవస్థతో పాలనలో పెనుమార్పులు
- నాడు పింఛన్ కోసం రోజుల తరబడి పడిగాపులు
- నేడు ఇంటికొచ్చి ఇస్తున్న వలంటీర్లు
- అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు సైతం ఇంటి వద్దకే



టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్‌దారుల పడిగాపులు(ఫైల్)



ప్రస్తుత ప్రభుత్వంలో లబ్ధిదారుడి ఇంటి వద్దే పింఛన్ పంపిణీ(ఫైల్)

పెనుగంచిప్రోలు: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు వారి గ్రామాల్లోనే పొందేలా వీలు కల్పించారు. దాంతో సచివాలయాలు ప్రజలకు సేవాలయాలుగా మారాయి. మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయతీల్లోనూ 15 సచివాలయాలు ఏర్పాటు చేశారు.

నాడు పింఛన్ల కోసం పాట్లు...

గతంలో పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పంచాయతీ కార్యాలయాల వద్ద పింఛన్ కోసం రోజుల తరబడి పడిగాపులు పడేవారు. పింఛన్ కోసం వెళ్లి సొమ్మసిల్లి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. నేడు ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీర్లు ఇంటికొచ్చి తలుపు తట్టి మరీ పింఛన్ ఇచ్చి వెళ్తున్నారు.

ఏ పత్రం కావాలన్నా అన్నీ ఇంటి వద్దకే...

గతంలో కొత్త పింఛన్ కావాలన్నా, దరఖాస్తు చేసుకోవాలన్నా, ఇంటి స్థలం, ఇళ్లు కావాలన్నా, ఇతర సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా సంబంధిత కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారికే పథకాలు అందేవి.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆమె పేరు నంచర్ల కోటమ్మ. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కార్యక్రమాలతో పాటు ఎన్నిమార్లు అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పింఛన్ అందలేదు. చివరకు పింఛన్ రాకుండానే తనువు చాలించింది.

	టీడీపీ హయాంలో	ప్రస్తుత ప్రభుత్వంలో
వృద్ధాప్య పింఛన్లు	1378	3,940
వితంతు పింఛన్లు	1203	788
మిగతా పింఛన్లు	542	1839
మొత్తం	3,123	6,567

నేడు అర్హత ఉంటే చాలు ఎవరి చుట్టూ తిరగకుండా లబ్ధిదారుల గడప వద్దకు సంక్షేమ పథకాలు వస్తున్నాయి. గతంలో కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం పనులు మానుకుని కార్యాలయాల చుట్టూ తిరిగినా వచ్చేవి కావు. నేడు దరఖాస్తు ఫారం దగ్గర నుంచి అన్నీ వలంటీర్ చూసుకుంటున్నారు. పత్రాలను ఇంటికే తెచ్చి ఇస్తున్నారు.



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు గంగధారి అరుణ. పెనుగంచిప్రోలు మండలం లోని లింగగూడెం గ్రామం. రేషన్ కార్డు కోసం ఏళ్ల తరబడి తిరిగినా రాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా కేవలం 30 నిమిషాల్లో కార్డు చేతికి రావటంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

సేవ చేసే అవకాశం జగనన్న కల్పించారు



ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని నాకు జగనన్న కల్పించారు. లబ్ధిదారులు నన్ను తమ కుటుంబ సభ్యుడికంటే ఎక్కువగా అభిమానిస్తున్నారు. సేవలకు గుర్తింపుగా ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నగదు పురస్కారంతో సేవా వజ్ర ప్రశంసా పత్రం, మెడల్ తీసుకోవటం జీవితంలో మరచిపోలేను.

–కొమ్మినేని సందీప్, వలంటీర్, పెనుగంచిప్రోలు సచివాలయం

కల్వర్టు ఆధునికీకరణకు చర్యలు

కల్వర్టును పరిశీలించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: కల్వర్టు ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని అంబారుపేట–కేతవీరునిపాడు గ్రామాల మధ్యనున్న కల్వర్టును రైతులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ కల్వర్టు వద్ద నీటి సరఫరా కాకపోతుండటంతో ఆయకట్టు పంట పొలాలకు నీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం రైతులను, వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటూ రైతు సంక్షేమ పాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు.

తూములు ఎత్తులో ఉండటమే కారణం

గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కల్వర్టుల్లో తూములు ఎత్తులో వేయటం వల్ల నీరు సరఫరా కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని జగన్‌మోహనరావు తెలిపారు. దీంతో సకాలంలో పంటకు సాగునీరు అందక రైతులు పంట నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంచనాలు తయారు చేసి నివేదికను ప్రభుత్వానికి పంపాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి రైతులకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, ఐలపోగు రామయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



కంచికచర్ల స్టాక్ పాయింట్ నుంచి విద్యా కానుక కిట్లను ఉపాధ్యాయులకు అందజేస్తున్న ఎంఈఓ

కంచికచర్ల: ఇప్పటికే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం పంపిణీ చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను అందజేసినట్లు మండల విద్యాశాఖ అధికారి లావుడ్యా చిట్టిబాబు తెలిపారు. కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న జేవీకే కిట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం అందజేశారు. ఈ మేరకు ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలు తెరిచిన రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు హెచ్‌ఎంలు అందజేస్తారన్నారు. బడి ప్రారంభమైన రోజు నుంచే జగనన్న గోరుముద్ద అమలుకు తగు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ ఏడాది ప్రయివేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థులు చేరేందుకు ఎక్కువ ఆసక్తి కనపర్చుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని వెలికి తీసేందుకే గ్రంథాలయాలు



అనిగండ్లపాడులో శిక్షణ శిబిరంలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు



నందిగామ గ్రంథాలయంలో విద్యార్థులతో ఆటలు ఆడిస్తున్న ఉపాధ్యాయుడు

పెనుగంచిప్రోలు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి విజ్ఞానాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిందని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం గ్రంథాలయాల్లో విద్యార్థులతో కథలు చదివించటం, నీతి వాక్యాలు చెప్పించటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు పలు రకాల పోటీలు

నందిగామ: పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు శనివారం పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పలు అంశాలపై కూడా పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ పాలకుడు షేక్ మస్తాన్ వలి తెలిపారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, ప్లంబర్ కోర్సుల్లో విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోనే శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 0866–2475575, 77804 29468, 91825 34259 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నూతన ధ్వజ స్తంభం ఊరేగింపు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని శ్రీరేణుకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నూతనంగా ఏర్పాటుచేయనున్న జీవ ధ్వజ స్తంభం ఊరేగింపు శనివారం అత్యంత వైభవంగా జరిగింది. రేణుకా పరమేశ్వరి దేవాలయంలో గతంలో ఉన్న ధ్వజస్తంభం 1931 నాటిది కావడంతో అది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రేణుకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ వారు దాని స్థానంలో నూతన ధ్వజస్తంభాన్ని త్వరలో ఏర్పాటుచేయనున్నారు. దీనిలో భాగంగా భద్రాచలం వద్ద ఉన్న చింతూరు గ్రామం నుంచి కొత్తగా తీసుకువచ్చిన ధ్వజస్తంభాన్ని పట్టణంలో ఊరేగించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఊరేగింపులో పాల్గొన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వడేఘర్ వెంకటేశ్వర్లు, మామిడి దశరథ రాము, కోశాధికారి, ఉపాధ్యక్షులు చమాన్ వెంకట శ్రీధర్, వడేఘర్ విజయకుమార్, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టూరిస్ట్ ప్రదేశంగా గాంధీ హిల్



గాంధీ హిల్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని గాంధీ హిల్ టూరిస్ట్ ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం ఒన్‌టౌన్‌లోని రూ.80 లక్షలతో పునరుద్ధరీకరణ జరుగుతున్న గాంధీ హిల్ అభివృద్ధి పనులను, నక్షత్ర ప్రదర్శనశాలలను శనివారం నగర కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల అభివృద్ధి చేసిన ప్లానిటోరియం లోపల సీట్లను, నక్షత్రాలు, గ్రహాలు ఇతర ఖగోళ వస్తువుల చిత్రాలను ప్రదర్శించే స్క్రీన్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గాంధీ పర్వతం ఒక టూరిస్ట్ ప్రదేశంగా ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలనే లక్ష్యంగా విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకోని, అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ గాంధీ కొండ చుట్టూ తిరిగే ట్రైన్ గ్రంథాలయం, లైటింగ్ సౌండ్ సిస్టం, పిల్లలకు ఆకర్షణీయంగా ఉండేలా ఆట పరికరాల ఏర్పాటు వంటి అంశాలపై దృష్టి సారించి వాటిలో కొన్ని ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నామని చెప్పారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, డిప్యూటీ సిటీ ప్లానర్ ప్లానింగ్ జుబిన్ శిరస్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

పెద్దాపురం(వీరులపాడు): అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని సూచించారు.

అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- ఎంపీ నిధులు రూ.25 లక్షలతో కమ్యూనిటీ హాల్
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు గ్రామంలో ఎంపీ నిధులు రూ.25 లక్షలతో చేపట్టనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చిన్నచిన్న కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. సమస్య చెబితే పరిష్కారమే మార్గంగా నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు. అనంతరం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్తాల పున్నమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లో వోల్టేజ్ నివారణకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఒకటవ వార్డు, ఆరవ వార్డులకు సంబంధించి శివగంగ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ శనివారం పరిశీలించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు స్థానికులు లోవోల్టేజ్‌తో బాధపడుతున్నామని తమ సమస్యలు చెప్పారు. దీంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఉదయభాను విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాల మేరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను కెపాసిటర్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించిన వైస్ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ శివగంగ కాలనీ వాసులకు ఇచ్చిన హామీ మేరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారని, ఇకపై పరిసర ప్రాంత ప్రజలకు లోవోల్టేజ్ సమస్య ఉండదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు, లైన్‌మెన్ బ్రహ్మం, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి మొబైల్‌లో దిశ యాప్ అవసరం



మహిళలతో దిశ యాప్ డౌన్ లోడ్ చేస్తున్న పోలీసులు

నందిగామ: దిశ యాప్ ప్రతి మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా ఉండాలని మహిళా ఎస్ఐ రమణ అన్నారు. పట్టణంలో శనివారం సాయంత్రం దిశ యాప్ డౌన్ లోడ్ కార్యక్రమం డ్రైవ్‌లా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళా ఎస్ఐ మాట్లాడుతూ దిశ యాప్ ప్రతి మొబైల్ ఫోన్‌లో ఉండాలన్నది లక్ష్యంగా డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఈ యాప్ అందుబాటులోకి తెచ్చిందని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మహిళల రక్షణ కోసమే ప్రభుత్వం ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, దిశ యాప్ ద్వారా ఇప్పటికే ఎంతోమందికి రక్షణ కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన డీసీపీ



డీసీపీకి స్వాగతం పలుకుతున్న చందర్లపాడు పోలీసులు

నందిగామ: డివిజన్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లను శనివారం సాయంత్రం డీసీపీ అజిత వేజెండ్ల ఆకస్మిక తనిఖీ చేశారు. నందిగామ రూరల్, జగ్గయ్యపేట సర్కిల్ కార్యాలయాలతో పాటు పెనుగంచిప్రోలు, చందర్లపాడు, కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లను ఆమె తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలోని రికార్డులను పరిశీలించడంతో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా తనిఖీలలో ఏసీపీ జనార్ధన నాయుడు, నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, ఆయా స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

యువ కవులను ప్రోత్సహించేందుకు కృషి

విజయవాడ కల్చరల్: యువ కవులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని డాక్టర్ రాధేయ పురస్కార కమిటీ సభ్యుడు దోర్నాదుల సిద్ధార్థ అన్నారు. పురస్కార కమిటీ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో శనివారం యువకవి తెలుగు వెంకటేష్‌కు డాక్టర్ రాధేయ పురస్కార సభ, కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించింది. దోర్నాదుల సిద్ధార్థ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కృషి చేసి అనేక గ్రంథాలు రచించిన సాహితీ ప్రముఖుడు అధ్యాపకుడు డాక్టర్ రాధేయ పేరుతో 2010లో పురస్కారాలు ఇవ్వడం ప్రారంభించామన్నారు. 2023 సంవత్సరానికి కర్నూలుకు చెందిన తెలుగు వెంకటేష్‌కు డాక్టర్ రాధేయ పురస్కారం ప్రదానం చేశారు. సాహితీవేత్త కోసూరి రవికుమార్ వెంకటేష్ కవిత్వ విశేషాలను వివరించారు. సభలో విద్యావేత్త బండ్ల మాధవరావు, రచయిత్రి డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి, కవి అనిల్ డ్యానీ, డాక్టర్ రాధేయ పాల్గొన్నారు.